క్లుప్తంగా

ప్రతి ఇంటికీ తాగునీరు



గవర్ల అనకాపల్లి జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక : జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు అన్నారు. తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో శుక్రవారం జల్‌జీవన్ మిషన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. ఇప్పటికే తోటాడలో పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. ఎంపీటీసీ వెంకటలక్ష్మి, సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్ రాము, వార్డు సభ్యుడు పరమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రుబ్బురోళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలని సీహెచ్‌వో దేవకాంత కోరారు. మునగపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీజన్‌లో రోగాలు దరి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నీటి నిల్వలు ఉండడం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. మునగపాక ఎంపీటీసీ–3 బోడ కుర్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీవో సందర్శన

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. నాగవరం,రాజుపేట గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. పారిశుధ్యం మెరుగునకు పాటుపడాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులకు సూచించారు. సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ఈవోఆర్డీ వెంకటలక్ష్మి,ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి త్రినాథ్, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన టాస్క్‌ఫోర్స్ బృందం



చూచుకొండ పీహెచ్‌సీని సందర్శించిన టాస్క్‌ఫోర్స్ బృందం

మునగపాక: మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది. ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న సేవలను బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని డీపీఎంవో డాక్టర్ లూసి కోరారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట జిల్లా గణాంకాధికారి ఎ.రామచంద్రరావు, డీపీవో కె.జగదీష్, డీపీహెచ్ఎన్‌వో నాగమణి, ఎంపీహెచ్‌ఈవో గుర్రం శ్రీనివాసరావు,ఎంపీహెచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడపవద్దు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక : ప్రతి ఆటో డ్రైవర్ మద్యం తాగకుండా వాహనాలు నడపాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. మండలంలోని చూచుకొండ ఆటో స్టాండ్ వద్ద శుక్రవారం ఆటో డ్రైవర్లతో మాట్లాడారు.వాహనాలు నడిపేటపుడు అతి వేగం సరికాదన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లరాదన్నారు. వాహనం వెంట రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

నారుమడుల్లో నీళ్లు... రైతుకు కన్నీళ్లు



మునగపాకలో నీటి ముంపులో వరి నారుమడులు



ముంపునకు గురైన నారుమళ్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు(ఫైల్)

- తుపానుతో నష్టపోయిన అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

మునగపాక: ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతన్నకు ఎప్పుడూ కష్టాలే. వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియక ఆందోళనకు గురవుతూనే వ్యవసాయం సాగు చేస్తుంటారు. సీజన్‌లో పంటల సాగుపై దృష్టి సారిస్తున్నా అకాల వర్షాలు రైతులను కంటతడి పెట్టిస్తున్నాయి. మండలంలోని వరి సాగుపై రైతులు ఆసక్తి చూపుతూ వస్తున్నారు. చెరకుతోటలకు ఏటా తెగుళ్లు సోకడంతో సాగు విస్తీర్ణం తగ్గించి వరిపై మక్కువ చూపుతూ వస్తున్నారు.

ముంపునకు గురైన నారుమడులు..

సీజన్‌కు అవసరమయ్యే పలు రకాల విత్తనాలను అధికారులు రైతులకు సరఫరా చేశారు. దీంతో రైతులు తమ వ్యవసాయ భూమిలో వరి నారుమడులు వేసుకున్నారు. నారు పెరుగుదలకు వచ్చే క్రమంలో వర్షాలు నీట ముంచాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పలు చోట్ల నారుమడులు ముంపునకు గురయ్యాయి. దీంతో వేలాది రూపాయల పెట్టుబడులను రైతులు కోల్పోయారు. నారుమడులకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికీ అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో సీజన్ ఆలస్యమయ్యే పరిస్థితుల పట్ల రైతులు కలవరపడుతున్నారు. వరి నారుమడులకు సంబంధించి కొంత మంది రైతులు రూ.3వేలకు పైగా అలాగే వెదజల్లే పద్ధతిలో సాగుకు రూ.12వేలకు పైగా పెట్టుబడులు చేయాల్సి వచ్చింది. రైతుకు జరిగిన నష్టాన్ని ఇటీవల జిల్లా స్థాయి వ్యవసాయాధికారులు కూడా గుర్తించారు.

2208 ఎకరాల్లో ముంపునకు గురైన వరినారు మడులు...

జిల్లా వ్యాప్తంగా వరి సాగు చేసే రైతులే అధికం. అనకాపల్లి డివిజన్ పరిధిలో 12,637 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల రైతులు నారుమడులు పూర్తి చేశారు. అకాల వర్షాలకు గాను జిల్లా వ్యాప్తంగా 2208 ఎకరాకు పైగా వరినారు మడులు ముంపునకు గురైనట్లు గుర్తించారు. మునగపాక మండలానికి వస్తే 16.7 హెక్టార్లకు సంబంధించి నారుమడులు, అలాగే 6.2 హెక్టార్ల మేర వెదజల్లే మడులు ముంపునకు గురైనట్లు గుర్తించారు. 798 మంది రైతులకు నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ముంపునకు గురైన పంటలకు సంబంధించి ఇప్పటికీ కొన్ని చోట్ల నీరు పోయే పరిస్థితులు కనిపించలేదు. దీంతో రైతులు కలవరపడుతున్నారు. గతంలో సాగునీటి కాలువల ద్వారా వచ్చే నీటి ఆధారంగా సాగు జరిగేది. అయితే కాలువలు అధ్వానంగా ఉండడంతో పలు చోట్ల ముంపు సమస్య ఉంది. నీరు పోయే మార్గాలు లేక పంటంతా దెబ్బతింటుందని వాపోతున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వరిసాగుకు అవసరమయ్యే విత్తనాలను ఉచితంగా అందించాలని రైతులు కోరుతున్నారు.

ఉచితంగా విత్తనాలు అందించాలి



వర్షాలు అకాలంగా కురవడంతో వరి రైతులకు తీరని నష్టం వాటిల్లింది.ఖరీఫ్‌కు వేలాది రూపాయలను పెట్టుబడి చేసి వరినారు మడులు వేశారు. అయితే వర్షాల కారణంగా నారుమడులు ముంపునకు గురయ్యాయి. దీంతో పెట్టుబడి కోల్పోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందజేసి నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలి.

–ఎస్.బ్రహ్మాజీ, సీఐటీయూ నేత

ప్రభుత్వానికి నివేదించాం



ఇటీవల కురిసిన వర్షాలకు నారుమడులు దెబ్బతిన్నట్లు గుర్తించాం. 22.9 హెక్టార్లకు పైగా నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించాం. అలాగే 798 మంది రైతులను గుర్తించాం. సీజన్‌లో పెద్దమొత్తంలో వరిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో తుపాను నష్టాన్ని కలిగించాయి. రైతులు కూడా ముంపునకు గురైన వరి నారుకు సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

–జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

శాకంబరిగా అమ్మవారి దర్శనం



యలమంచిలి రూరల్ : పద్మనాభరాజుపేట గ్రామంలో వున్న దుర్గాదేవి అమ్మవారిని ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా శాకంబరి అవతారంలో అద్భుతంగా అలంకరించారు. ఆలయ గర్భగుడిలో వున్న అమ్మవారి మూలవిరాట్‌ను పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. పీఎస్‌ఆర్‌పేట, బయ్యవరం ఉభయ గ్రామాలకు చెందిన భక్తులు శాకంబరి అవతారంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందున్న షెడ్‌ను కూడా కాయగూరలతో అలంకరించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు గౌరీ శంకర శర్మ ప్రత్యేకాభిషేకం, కుంకుమార్చన చేశారు. సర్పంచ్ గొన్నాబత్తుల శివలక్ష్మి, శివ దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. భజన మండలి సభ్యులు ఆధ్యాత్మిక భక్తి గీతాలు వినిపించారు. భక్తులందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత ఊటకూటి శేఖర్, జెర్రిపోతుల వెంకట్, జెర్రిపోతుల నానాజీ, బుజ్జి, రాయవరపు వెంకట్, మొల్లి అప్పారావు, కలిగట్ల నానాజీ, బాబూరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విత్తనశుద్ధి ద్వారా మెరుగైన దిగుబడులు



మాట్లాడుతున్న ఆత్మ వ్యవసాయాధికారి విజేత

మునగపాక : విత్తనశుద్ధి ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆత్మ వ్యవసాయాధికారి విజేత అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అరబుపాలెంలో రైతులతో మాట్లాడారు. విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సుడోమోనస్‌తో విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు.

మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఈవో సాయివాణి, వీఏఏ సత్య రవిరాజ్, రైతులు సూరి అప్పారావు, గంగాధర్, సత్యనారాయణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై గడ్డి విత్తనాల పంపిణీ



రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు: పాడి రైతులు పశువులకు మేతగా కాకిజొన్న, మొక్కజొన్న రకం గడ్డిని అందించాలని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. కొరువాడ, వి.సంతపాలెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా శుక్రవారం రైతులకు రాయితీపై కాకి, మొక్కజొన్న గడ్డి విత్తనాలను అందించారు. ఈ రకం గడ్డిని పశువులు మేతగా తినేందుకు ఇష్టపడతాయన్నారు. గడ్డిలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్ ఎక్కువగా ఉండడం వల్ల పాల దిగుబడి అధికంగా ఇవ్వడంతోపాటు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ రెండు రకాల గడ్డి విత్తనాలను నాటిన 45 నుంచి 60 రోజుల లోపు కోతకు చేరుకుంటుందన్నారు. ఐదు కిలోల కాకిజొన్న గడ్డి విత్తనాలు రాయితీపై రూ.115కు, మొక్కజొన్న రకం గడ్డి విత్తనాలు రూ.85కు ఇస్తున్నట్లు తెలిపారు. వి.సంతపాలెం పశు వైద్య సహాయకుడు లింగేశ్వరరావు పాల్గొన్నారు.

డివిజన్‌లో 3,628 కౌలు కార్డుల మంజూరు లక్ష్యం

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నాతవరం: డివిజన్‌లో 167 రెవెన్యూ గ్రామాల్లో 3,628 కౌలురైతులకు కార్డులు ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి. జయరాం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో రైతుల ప్రధాన సమస్యలను డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ డివిజన్‌లో అధికంగా నాతవరం మండలంలోనే 856 మంది కౌలురైతులకు కార్డులు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. తర్వాత నక్కపల్లి, చీడికాడ, కోటవురట్ల, గొలుగొండ, రోలుగుంట మండలాల్లో అధికంగా ఉన్నాయన్నారు. అర్హత ఉంటే ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. డివిజన్‌లో రికార్డులు భద్రతలో భాగంగా అన్ని తహసీల్దార్ల కార్యాలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 1/70 యాక్టు పరిధి గ్రామాల్లో గిరిజనులకు అటవీ హక్కుపత్రాలు మంజూరుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నాతవరం, గొలుగొండ, రోలుగుంట, చీడికాడ మండలాల్లో పోడు భూములు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు బాలరెడ్డి, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, ఆర్ఐ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

చినపూడిలో వివాహిత ఆత్మహత్య

రాంబిల్లి (యలమంచిలి) : వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చినపూడి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం, రాణిగామ్ తాళ్లభద్ర గ్రామానికి చెందిన కర్డేన తేజేశ్వరి రాంబిల్లి మండలం చినపూడి గ్రామం వద్ద ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందింది. తేజేశ్వరి భర్త ఆనంద్‌తో కలసి రాంబిల్లి మండలం చినపూడి గ్రామంలో గత 6 నెలలుగా ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఆనంద్ స్థానిక ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఆమె భర్త డ్యూటీకి వెళ్లగా ఇంట్లో ఎవరులేని సమయంలో తేజేశ్వరి ఇంటిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతురాలి భర్త, స్థానికులు తెలిపారు. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేయడం జరిగిందని, కుటుంబసభ్యులు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరుగుతుందని సీఐ తెలిపారు.

సెజ్‌లో ఉద్యోగాలు కల్పించాలి

అచ్యుతాపురం : ఎస్‌ఈజెడ్ కంపెనీల్లో పూడిమడక మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా మత్స్యకార సంఘం నాయకుడు చోడపల్లి అప్పారావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చేపల వేట నిషేధ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే మత్స్యకార భరోసాను తక్షణమే అందజేసి మత్స్యకారుల్ని ఆదుకోవాలని కోరారు. పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే అందజేయాలని కోరారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

కోటవురట్ల: పారిశుధ్యం మెరుగుకు ప్రతి పంచాయతీలో చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ ఆదేశించారు. మండలంలో ఆమె శుక్రవారం పర్యటించారు. కోటవురట్ల, బి.కె.పల్లి, యండపల్లి గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య డ్రైవ్‌ను పరిశీలించారు. బి.కె.పల్లిలో ఆధార్ సెంటర్‌ను పరిశీలించి సేవలపై ఆరా తీశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ పాపారావుకు సత్కారం



బదిలీపై వెళుతున్న తహసీల్దార్ పాపారావును సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని డీటీ వినయ్‌కుమార్ అన్నారు. ఇక్కడి తహసీల్దార్‌గా పని చేసిన పాపారావుకు బదిలీ కావడంతో శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ తహసీల్దార్ పాపారావు హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సేవలందించారన్నారు. ఆర్ఐ కిషోర్‌కుమార్, పలువురు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ బాలల డ్రైవింగ్ ప్రమాదకరం

కశింకోట: మైనర్ బాలలు వాహనాలు నడపడం ప్రమాదకరమని, వారిని వాహనాల డ్రైవింగ్‌కు అనుమతించరాదని జిల్లా రవాణాశాఖ అధికారి జి.మనోహర్ సూచించారు. మండలంలోని కన్నూరుపాలెంలో ఓ ప్రైవేట్ స్కూల్లో శుక్రవారం రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు తోడ్పడాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తలకు హెల్మెట్, కారులో సీటు బెల్టు తప్పక ధరించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమన్నారు. ఈ విషయాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.గోపీకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.అన్నారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



రహదారి భద్రత సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి మనోహర్

కష్టకాలంలో కొండంత అండ



దర్శిని కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్: ఇటీవల రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో ప్రేమోన్మాది చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురైన 9వ తరగతి విద్యార్థిని బద్ది దర్శిని కుటుంబానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. కుమార్తెను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి కష్టకాలంలో నేనున్నానంటూ కొండంత భరోసానిస్తూ రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతల ద్వారా అందించి ఓదార్పునిచ్చారు. శుక్రవారం యలమంచిలి పార్టీ కార్యాలయంలో రూ.5 లక్షల చెక్కును పార్టీ సీనియర్ నేత, డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ (తేజ) బాధిత కుటుంబానికి అందించారు.

ఆయుర్వేద ఆస్పత్రికి వైద్యుడి నియామకం



యలమంచిలి ఆయుర్వేద ఆస్పత్రిలో శుక్రవారం విధులు నిర్వహిస్తున్న వైద్యుడు బినయ్ కుమార్

యలమంచిలి రూరల్ : యలమంచిలి ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో 10 నెలలుగా వైద్యుడు లేకపోవడంతో రోగులు పడుతున్న అవస్థలకు సంబంధించి ఇటీవల సాక్షి దినపత్రికలో 'ఆయుష్ హుష్ కాకి' శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఇక్కడ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడు పి.ఎస్ బినయ్ కుమార్‌ను నక్కపల్లి మండలం వేంపాడు ఆయుర్వేద డిస్పెన్సరీకి ఇంఛార్జ్‌గా నియమించారు. దీంతో గత ఏడాది సెప్టెంబరు 14 నుంచి వైద్యుడు యలమంచిలి ఆస్పత్రికి రావడం మానేశారు. అప్పట్నుంచి ఈ ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఇబ్బందులు మొదలయ్యాయి. యలమంచిలి పట్టణం, చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆయుర్వేద వైద్యం కోసం ఇక్కడికి వచ్చి వైద్యుడు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చేది. వైద్యుడు లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఒకరు మాత్రమే ఆస్పత్రికి మొక్కుబడిగా వచ్చి పోవడంతో క్రమంగా ఓపీ కూడా తగ్గిపోయింది. ఆస్పత్రికి ప్రభుత్వం సరఫరా చేసిన ఔషధాలకు కాలం చెల్లిపోవడంతో ప్రజాధనం వృధా అయ్యేది. ఈ పరిణామాలన్నింటినీ తెలియజేస్తూ సాక్షిలో కథనం రావడంతో ఆయుష్ శాఖ విశాఖ ఆర్‌డీడీ స్పందించారు. వైద్యుల కొరతతో ఇబ్బంది వచ్చిందని తెలిపారు. నక్కపల్లి ఆయుర్వేద ఆస్పత్రిలో ఇంఛార్జిగా విధులు నిర్వహిస్తున్న పి.ఎస్ బినయ్ కుమార్‌ను వారంలో మూడు రోజులు యలమంచిలో, మిగిలిన మూడు రోజులు వేంపాడులో విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం వారంలో సోమ, బుధ, శుక్ర వారాలు యలమంచిలిలోను, మంగళ, గురు, శనివారాలు వేంపాడు ఆస్పత్రిలో వైద్యుడు విధుల్లో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం వైద్యుడు పి.ఎస్ బినయ్ కుమార్‌ను యలమంచిలి ఆయుర్వేద ఆస్పత్రిలో విధులు నిర్వహించారు. సాక్షి కథనంతో ఆయుర్వేద ఆస్పత్రికి వైద్యుణ్ణి నియమించడంతో స్థానికులు, ముఖ్యంగా ఆయుర్వేద వైద్యంపై ఆధారపడే వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు.

కార్గిల్ అమరవీరులకు నివాళులు



జాతీయ రహదారిపై ర్యాలీ



కళాశాల విద్యార్థులతో మానవహారం

నక్కపల్లి : మండల కేంద్రంలో శుక్రవారం కార్గిల్ విజయోత్సవ దివస్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కోసూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు వీరోచితంగా పోరాటం చేసి దేశాన్ని కాపాడారన్నారు. కార్గిల్‌యుద్ధంలో ఎంతోమంది వీర సైనికులు వీరమరణం పొందారని, వీరిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్గిల్‌పోరులో అమరులైన సైనికులందరికీ ఘనంగా నివాళులర్పించారు. కళాశాల విద్యార్థులు స్థానికులతో కలసి జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. మాజీసైనికులను సత్కరించారు. కార్గిల్ వీరోచిత గాథను పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. ర్యాలీ అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి శైలజ, అధ్యాపకులు భీమసేన, అప్పారావు, సతీష్, నాయకులు పాకలపాటి రవిరాజు, జోగిరాజు, వేముల వెంకటరమణ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు



తహసీల్దార్ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

నక్కపల్లి : నక్కపల్లి తహసీల్దార్ శ్రీకాంత్‌కు బదిలీ అయింది. దాదాపు ఆరు నెలల పాటు ఆయన ఇక్కడ పనిచేశారు. ఎన్నికల ముందు సొంత జిల్లాల నుంచి వివిధ జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దారందరినీ ప్రభుత్వం వారి వారి జిల్లాలకు తిరిగి బదిలీ చేసింది. ఇందులో భాగంగా శ్రీకాంత్ తన సొంత జిల్లా శ్రీకాకుళానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది శుక్రవారం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో కుంచం నరేష్ తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలను ఏఆర్‌వో హోదాలో శ్రీకాంత్ సమర్థంగా నిర్వహించారన్నారు. అంకితభావంతో, నిబద్ధతతో పనిచేసి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజల మన్ననలు పొందారన్నారు. తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేసిన కొద్ది కాలంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం మరువలేనిదన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం



వెంకటాపురంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ నాగలక్ష్మి

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా కో–ఆర్డినేటర్ జి.నాగలక్ష్మి అన్నారు. వెంకటాపురం సంపద తయారీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్తకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న వెంకటాపురం సంపద తయారీ కేంద్రం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ నీలకంఠస్వామి, ఎంపీటీసీ వీరునాయుడు, మాజీ ఎంపీటీసీ వీరునాయుడు, పంచాయతీ కార్యదర్శి మోహిని లక్ష్మి పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియాపై అప్రమత్తం



గొడిచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నక్కపల్లి : డెంగ్యూ, మలేరియా జ్వరాలు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ గొడిచర్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించాది. ర్యాలీని ప్రారంభించిన వైద్యాధికారి డాక్టర్ సుకన్య మాట్లాడుతూ దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకుతాయన్నారు. వాటిని నివారించడానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లముందు చెత్త, నిల్వ నీరు తొలగించాలన్నారు.

నిల్వ ఉన్న చేపలు, మాంసం వంటి ఆహార పదార్థాలు తినరాదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోలు శ్రీనివాసరావు, లక్ష్మణమూర్తి,ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.